క్లుప్తంగా

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల



పెదకాకాని: మండలంలోని కొప్పురావూరులో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి తిరునాళ్ల గురువారం సందడిగా జరిగింది. వేకువజామున అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, అఖండ హోమంతో పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. సాయంత్రం సంప్రదాయంగా కంతేరు నుంచి కుంకుమ బండ్లు ఆలయానికి చేరుకున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుల భక్తులకు గోత్రనామ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జరిగిన శివపార్వతుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కనక తప్పెట్లుతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. విద్యుత్ కాంతులతో కళకళలాడింది.

స్కౌట్స్‌తో దేశభక్తి, సేవాభావం

కాకుమాను: స్కౌట్స్‌తో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు దేశభక్తి, సేవాభావం అలవడుతుందని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను జిల్లా సమన్వయకర్త ఎం.ఏడుకొండలు ప్రారంభించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాణించిన విద్యార్థులు రాష్ట్ర,జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులంతా కష్టపడి నేర్చుకోవాలని ఆయన సూచించారు.స్కౌట్స్ జిల్లా శిక్షణ కమిషనర్ నరేష్ విద్యార్థులకు గైడ్స్ నియమనిబంధనల గురించి వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సత్యం, ఉమాదేవి, శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం




గుంటూరు రూరల్: భారతీయ జనతా పార్టీ గుంటూరు రూరల్ ఉత్తర మండల సమావేశం గురువారం గోరంట్లలోని అన్నపూర్ణనగర్‌లో మండల అధ్యక్షుడు కంచర్ల రాజేష్ అధ్యక్షన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయిలో పటిష్ట పరచాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు కొత్తూరు సుబ్బారావు మాట్లాడుతూ పార్టీ పటిష్ట కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, కుమార్‌గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు పాండురంగ విట్టల్, పత్తిపాడు అసెంబ్లీ కన్వీనర్ కన్నా రవిదేవరాజ్, కో-కన్వీనర్ దర్శనపు శ్రీనివాస్, ఎస్సీ మోర్చా నాయకులు దారా అంబేడ్కర్, జిల్లా నాయకులు ఆవుల రామకోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నీలం సాంబశివరావు, తాళ్ల సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మిర్చి యార్డు గుమస్తా మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో మిర్చి యార్డు గుమస్తా మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి హౌసింగ్ బోర్డ్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్చి యార్డులో గుమస్తాగా పని చేస్తున్న కొత్త కాలనీకి చెందిన దొడ్డా రత్నాకర్ (64) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనుక నుంచి మితి మీరిన వేగంతో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రత్నాకర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీ సహా పరారయ్యాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అక్మే స్కూల్ డైరెక్టర్‌కు అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ పొత్తూరులోని అక్మే స్కూల్ డైరెక్టర్ నందమూరి దీప్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు-2025 అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ నందమూరి సౌగంధ్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై ఐఐటీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె అందుకున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్ నిరంకుశ వైఖరిపై నిరసన

- స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగిస్తున్న ఉద్యోగుల ఆందోళన
- పని భారం, జీతంలో కోతపై ఆవేదన



కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

చేబ్రోలు: స్మార్ట్ విద్యుత్ మీటర్లు బిగిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కాంట్రాక్టరు నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలోని స్మార్ట్ మీటర్ల గోడౌన్ కార్యాలయం వద్ద గురువారం సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది ఆగస్టు నుంచి జిల్లా మొత్తం మీద 12,00 మందిని ఒక్కొక్కరికీ రూ.30వేలు వేతనంతో ఏడాది పాటు పనిచేసే విధంగా ఒప్పందంతో కాంట్రాక్టర్ విధుల్లోకి తీసుకున్నాడు. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, షాపులు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను చేపట్టారు. దాదాపు 90శాతం మీటర్ల బిగింపు ప్రక్రియ జరిగింది. పొమ్మని చెప్పకుండా పొగబెట్టే విధంగా కాల పరిమిత పూర్తి అవకుండానే సిబ్బందిని ఇంటికి పంపిచే విధంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పని టార్గెట్ ఇవ్వడంతో పాటు ఆదివారాలు కూడా పని చేయిస్తున్నారని, వేతనాల్లో కూడా ఒక్కొక్కరికీ రూ. 5వేలు నుంచి రూ. 10వేల వరకు వేతనంలో తగ్గిస్తుండటంతో ఆవేదన చెందుతున్నారు. దీంతో వారు నారాకోడూరులోని గోడౌన్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. జేఈ వలి, హెచ్‌ఆర్ ప్రకాశరావు తమపై పని భారం పెంచుతూ అలవెన్స్‌లు, జీతంలో కోత విధిస్తున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తామని కాంట్రాక్టర్ ప్రతినిధులు ప్రకటించడంతో వారు శాంతించారు.

మహిళలను గౌరవించే చోట దేవతల కొలువు



మహిళా ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఇటీవల జెడ్పీ ఆవరణలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం జరిగిన బహుమతి ప్రధానోత్స సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ నాయకుడు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు అధ్యక్షత వహించిన సభలో హెనీ క్రిస్టినా మాట్లాడారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అన్ని రంగాల్లోనూ వారు ఎదగటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు మాట్లాడుతూ పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు సీట్లను పెంచాలన్నారు. పంచాయతీరాజ్ జిల్లా కో-ఆర్డినేటర్ పద్మారాణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో మహిళలు ముందుకు సాగాలని సూచించారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం కావాలని తెలిపారు. డెప్యూటీ సీఈఓ సీహెచ్.కృష్ణ, అకౌంట్స్ అధికారి శామ్యూల్ పాల్ మాట్లాడుతూ సమాజంలో ఇంకా మార్పు రావాలని, మహిళలను ప్రోత్సహించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆటలు పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.

కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి



కాకుమాను: ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదనందిపాడు ఎస్సీ కాలనీలో పనులు చేస్తున్న కూలీలతో గురువారం ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా గత ఆరు వారాలుగా వేతనాలు పడడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రామారావు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసేది పేద, మధ్య తరగతి ప్రజలని తెలిపారు. సకాలంలో వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని పాలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిని కల్పించి, రోజుకు కనీసం రూ.300 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, రైతు సంఘం నాయకులు కొత్త వెంకట శివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు ఘన నివాళి



మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు



తుమ్మలపాలెంలో మొల్ల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు

గుంటూరు రూరల్: శాలివాహన సమన్వయ సంఘం ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి ఆతుకూరి మొల్ల 585వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని రవినగర్‌లో గల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలివాహనుల కులదైవం మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నగరంలో మొల్ల విగ్రహం ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. విగ్రహ ఏర్పాటుకు పెద్దలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజవరపు శ్రీనివాసరావు, మండేపూడి పురుషోత్తం, రాజవరపు మురహరిరావు, కాజ శ్రీనివాసరావు, నారాయణ, బి. వెంకటేశ్వర్లు, యు.వెంకటేశ్వర్లు, వల్లూరి నాగేశ్వరరావు, కె. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళి

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య నాయకత్వంలో, ఐలాపురం భాస్కర్ శ్రీనివాస్ సారథ్యంలో, గుంటూరు జిల్లా కమిటీ, ప్రత్తిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తుమ్మలపాలెంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలాపురం భాస్కర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహనులంతా ఐక్యతగా ఉండి ముందుకు సాగాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ సంఘీయులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాంపట్నం నాగబాబు, జిల్లా యువజన అధ్యక్షుడు మామిళ్లపల్లి సుబ్బారావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు పొర్లెళ్ల రమేష్, గుంటూరు పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎనగందుల పూర్ణచంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆకారపు అంకమ్మరావు, యువజన కమిటీ నాయకులు కొండూరు వెంకటేశ్వర్లు, ఎల్లటూరి రవీంద్ర, కొండపల్లి పూర్ణచందు, కందుకూరి సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు మద్దికుంట శ్రీనివాసరావు, వరికల్లు సుధాలక్ష్మి, దుడికి మహేశ్వరి, ఆదిలక్ష్మి, వెల్లటూరి లక్ష్మి, శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులకు ఎముకల సాంద్రత పరీక్షలు



గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు వైద్య కళాశాలలో వైద్యులు, సిబ్బందికి ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రెండు రోజులపాటు చేసిన పరీక్షల్లో 40 శాతం మంది ఆస్టియోనియా సమస్యతో, 20 శాతం ఆస్టియోపొరాసిస్‌తో బాధపడుతున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నారాయణరావు తెలిపారు. వైద్య శిబిరంలో 50 మంది వైద్యులు, 200 మంది సిబ్బంది, పీజీ వైద్యులు పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు యూనిట్ నేతలు డాక్టర్ భానుకుమార్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ శివగోపాల్, డాక్టర్ సుధారాణి, యూనియన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

అవకతవకలకు చిరునామాగా ఎన్నికల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్లేషకులు ప్రసాదరావు

లక్ష్మీపురం: అవకతవకలకు చిరునామాగా మారిన కేంద్ర ఎన్నికల సంఘంపై పార్లమెంట్ ఉభయసభల్లో దద్దరిల్లినా సమాధానం చెప్పకుండా దాటవేస్తున్న తీరు సిగ్గుపడాల్సిన విషయమని విశ్లేషకులు ముప్పాళ్ల ప్రసాదరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సిన ఎన్నికల సంఘం అడుగడుగునా లోపాయికారి వ్యవహారాలతో ఎన్నికలు జరిపిస్తుందన్న ఆరోపణలు అనేక రాష్ట్రాల నుంచి వస్తున్నాయని తెలిపారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిష్పగా నిర్వహించాల్సిన ఎన్నికల నిర్వహణ ఈ మధ్యకాలంలో నవ్వుల పాలవుతున్నా, తనకేం సంబంధం లేనట్లు ఎన్నికల కమిషన్ ప్రవర్తిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రలో ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూడు నెలలైనా సమాధానాన్ని ఎన్నికల కమిషన్ ఇవ్వలేదని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు ఆర్.రామచంద్రరావు, న్యాయవాది అవధానుల హరి ప్రసంగించారు.

వైద్య ఉద్యోగుల యూనియన్ నాయకుడు బాలయ్య మృతి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య (57) గురువారం మృతి చెందారు. ఆయన జీజీహెచ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. అనారోగ్యంలో అక్కడే కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్నారు. బాలయ్య భౌతికాయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడానికి నిరంతరం కృషి

కాంగ్రెస్ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ భార్గవ్



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవ్

లక్ష్మీపురం: రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి నిరంతరం కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ అన్నారు. ఆయన గురువారం గుంటూరు వచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలక విజయకుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, బిల్లా సునీల్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భార్గవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు అప్పగించిన బాధ్యతకు పూర్తి న్యాయం చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చేందుకు ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం విజయకుమార్, రాచకొండ జాన్‌బాబు, జొన్నాల వెంకటరెడ్డి, తవిశెట్టి మోహన్‌రావు, బొట్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో 2023 జూన్ 16 నుంచి పని చేస్తున్న 18 మంది ఎంఈవో-2 వేతనాల నుంచి మినహాయించిన నిధులను జెడ్పీ పీఎఫ్ ఖాతాలకు జమ చేయాలని ఏపీ మండల విద్యాశాఖాధికారుల (ఎంఈవో-2) సంఘ అమరావతి శాఖ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గురువారం జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ రామకృష్ణ, ఆర్. సుబ్బారావు మాట్లాడుతూ ఎంఈవో-2 వేతనాల నుంచి మినహాయిస్తున్న నిధులు ఇప్పటి వరకు జెడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదని తెలిపారు. ఎంఈవోల్లో పలువురు త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్నట్లు చెప్పారు. పిల్లల వివాహాలు, ఇతరత్రా ఖర్చుల కోసం రుణం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పీఎఫ్ ఖాతా అప్‌డేట్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్ట్‌లది కీలకపాత్ర

- చలపతి ఫార్మసీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు
- ఘనంగా 21వ వార్షికోత్సవం



విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులది కీలకపాత్ర అని నాట్కో ఫార్మా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ వీరనారాయణ అడ్డగడ్డ అన్నారు. నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ట్రాన్స్‌ఫార్మింగ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ అండ్ ఫార్మకో ఎకనామిక్స్ త్రూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మిషన్ లెర్నింగ్ (ఎంఎల్) అనే అంశాలపై సదస్సును నిర్వహించారు. దీంతో పాటు కళాశాల 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరనారాయణ మాట్లాడుతూ ఫార్మసీ రంగం అనేది ఒక కోర్సు మాత్రమే కాదని, అది మానవ సేవకు నడిపించే ఒక మిషన్ అని తెలిపారు. కళాశాలలో నేర్చుకున్న ప్రతి విషయం, చేసే ప్రయత్నం, సమాజానికి ఒక గొప్ప ఆశా కిరణం అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ హార్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ కన్వీనర్ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫార్మసీ విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదని, ఇది ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగిన ఒక విభాగమని తెలిపారు. కెన్యా హెచ్ అండ్ మోర్ కే లిమిటెడ్ సీఎస్ఓ, జనరల్ మేనేజర్ ఎం. హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కోవిడ్ వంటి కష్ట కాలంలో ఫార్మాసిస్టులు ముఖ్య పాత్ర పోషించినట్లు చెప్పారు. సరైన ఔషధాన్ని రోగులకు చేర్చడం, ప్రిస్క్రిప్షన్ ఆధారిత సలహాలు, సూచనలు ఇవ్వడం కేవలం ఫార్మాసిస్టులతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సూర్యాపేట వికాస్ ఫార్మజీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ఆడెపు మాట్లాడుతూ మన సమాజంలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందినా, అనధికారికంగా ఫార్మాసిస్ట్ లేని మందుల షాపులు పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె. రవిశంకర్, హైదరాబాద్ సాండోస్ ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్ మేనేజర్ జడా నళిని తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాక్సిస్- 2024 స్టూడెంట్ మేగజైన్‌ను అతిథులు ఆవిష్కరించారు. బెంగళూరు ఆక్సోక్రోమోఫోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ మిస్టర్ శ్రేయస్ బుర్జి చలపతి ఫార్మసీ కళాశాలతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఓరల్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ఫార్మా క్విజ్, ఫార్మా హ్యాకథాన్, ఫోక్ డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వై.వి. ఆంజనేయులు గోల్డ్ మెడల్, అనంత కుమారి గోల్డ్ మెడల్‌లను అందజేశారు. 100శాతం అటెండెన్స్ అవార్డ్స్, బెస్ట్ లైబ్రరీ యుటిలైజేషన్ అవార్డు, ఎన్‌ఎస్‌ఎస్ బెస్ట్ వలంటీర్స్ అవార్డులను విద్యార్థులకు అందజేశారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, కార్యదర్శి వై. సుజిత్‌కుమార్, ప్రిన్సిపల్ నాదెండ్ల రామారావు అతిథులను ఘనంగా సత్కరించారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలలోని 36 మంది విద్యార్థులకు రూ 3.6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ ఏడాది, 2024-25 విద్యా సంవత్సరానికిగాను వివిధ కంపెనీలు కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఇప్పటి వరకు 654 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. మరికొన్ని కంపెనీల నుంచి నియామక పత్రాలు అందనున్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సీహెచ్. శ్రీనివాసరావు, కె. సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

పరీక్షలంటే భయం, ఆందోళన వద్దు

ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న అద్దంకి శ్రీధర్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షల పేరుతో విద్యార్థులు అర్థం లేని భయం, ఆందోళనకు గురి కావద్దని సీనియర్ ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు పరీక్ష సమయంలో ఒత్తిడిని అధిగమించి, ప్రశాంత వాతావరణంలో రాసేందుకు సూచనలు చేశారు. ఏడాది పొడవునా పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివిన విద్యార్థులు చదివిన అంశాలను చక్కగా ప్రజెంట్ చేసే వేదికగా పబ్లిక్ పరీక్షలను ఉపయోగించుకోవాలని తెలిపారు. పరీక్షల పేరుతో అనవసరమైన ఆందోళన వద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలో టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఎదుర్కోవాల్సిందేనని, అందుకు మానసికంగా సన్నద్ధం కావాలని సూచించారు. సమయ సద్వినియోగం, పాజిటివ్ ఆలోచనలు, మంచి ఆహారం, తగినంత నిద్ర, సబ్జెక్టుల వారీగా చదువుకోవడం వంటి అంశాలు పరీక్షల్లో మంచి విజయానికి దోహదం చేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో అనకు ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు, ఎగ్జామ్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఆచార్య శివరామ్ ప్రసాద్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏఎన్‌యూ కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగ డీన్ ఆచార్య ఆర్. శివరామ్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో 'సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు - అంకుర పరిశ్రమలు - గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో వీటి పాత్ర 'అనే అంశంపై ఎంబీఏ విభాగ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తెలిపారు. గ్రామాలను దత్తత తీసుకుని, వాటి అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. అనంతరం పరిశోధన పత్రాలు సమర్పించిన అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



వివిధ పోటీల్లో విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థినులు వ్యాపార నైపుణ్యాలతో పాటు నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి. సంధ్య తెలిపారు. గోరంట్లలోని కళాశాలలో గురువారం బీజీల్ 2కే25 ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు క్విజ్, పీపీటీ, యాడ్ మేకింగ్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ పి.ఎల్.నరసింహారావు, జి. రాధిక, శిరీష పాల్గొన్నారు.